క్లుప్తంగా

ఆర్థికసాయం



విద్యార్థి మనోజ్‌కు చెక్కు అందచేస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్: కడప మానవత సంస్థ చల్ల అనిత కుమారుడు మనోజ్‌కుమార్‌రెడ్డి చదువుకు రూ. 10 వేలు ఆర్థిక సహాయాన్ని అందించింది. పేద విద్యార్థి అయిన మనోజ్‌కుమార్ రెడ్డి ఉస్మానియాలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్నారు. ఆ విద్యార్థి పుస్తకాల కొనుగోలుకు మంగళవారం మానవత సంస్థ విద్యార్థి తల్లి అనితకు రూ. 10 వేల చెక్కును అందజేసింది. ఈ కార్యక్రమంలో మానవత సెంట్రల్ కమిటి డైరెక్టర్ రాటాల గోపీ, విద్యా కమిటి డైరెక్టర్ బాలయల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకర్లు శుభ్రం చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : గ్రామ పంచాయతీల్లోని అన్ని తాగునీటి ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి విధిగా శుభ్రం చేయాలని డీపీఓ కార్యాలయ పరిపాలన అధికారి ఖాదర్‌బాష పంచాయతీ కార్యదర్శులకు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. పీఆర్1 యాప్ తోపాటు ఈ విషయమై శుభ్రపరిచిన తేది, తదుపరి శుభ్రపరచాల్సిన తేదీలు ట్యాంకు వద్ద నమోదు చేయాలన్నారు. తాగునీటి ట్యాంకులలో నీటిని నింపిన ప్రతిసారి విధిగా నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం క్లోరినేషన్ నిర్వహించాలన్నారు. తాగునీటి పైపులైన్ల లీకేజీల మరమ్మత్తులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాల్సి ఉందన్నారు. ప్రతి శుక్రవారం జీవ కలుషితంగా (బయాలజికల్ కంటామినేషన్) ఉన్న నీటి నాణ్యతా పరీక్షల ఫలితాలు పంచాయతీ కార్యదర్శుల యాప్‌లో ప్రదర్శించబడతాయన్నారు. ఈ విషయంలో తాగునీటి అంశంపై వచ్చిన సమస్యలను పరిష్కరించి తీసుకున్న చర్యలను పంచాయతీ కార్యదర్శి యాప్‌లోని తన లాగిన్‌లో విధిగా నమోదు చేయాలని ఆదేశించారు.

సదుపాయాలు కల్పించాలి

కడప రూరల్: కడప నగరం గౌస్ నగర్ లో గల మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ హైస్కూల్ లో మౌలిక సదుపాయాలు కల్పించాలని జేకే యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు ఖాదర్‌బాష తెలిపారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవితకు వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఉర్దూ స్కూల్‌లో ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. స్కూలులో ఫర్నిచర్‌తోపాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.


బోధనలో నూతన విధానాలను అవలంబించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సలీంబాష

కడప ఎడ్యుకేషన్: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులకు బోధనలో నూతన విధానాలను అవలంబించడం వల్ల విద్యపై ఆసక్తి పెరుగుతుందని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సలీంబాష పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో ఐక్యూఏసీ ఆధ్వర్యంలో ఇంటిగ్రేషన్ ఆఫ్ ఐటి టూల్స్ ఇన్ ఎడ్యుకేషన్ అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఇందులో ప్రధాన వక్తగా పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శామ్యుల్ డేవిడ్‌రాజు నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ -2020 విద్యా విధానంలో బోధనలో చోటు చేసుకున్న పద్ధతుల గురించి మెర్లిన్ ఏఐ, గూగుల్ ఏఐ వంటి ఎన్నో ఏఐ టూల్స్ గురించి అవగాహన కల్పించారు. ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ సివి కృష్ణవేణి మాట్లాడుతూ ప్రస్తుత బోధనా విధానాలలో ఆర్టిఫిసియల్ ఇంటిలిజెన్స్ ఉపయోగించడం అనివార్యం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కె. నాగమునిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కే. మదన్మోహన్, డాక్టర్ పి.గురివిరెడ్డి పాల్గొన్నారు.

రిమ్స్‌లో పనిచేయని లిఫ్ట్



కడప అర్బన్: కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్) ఓపి విభాగంలో గత కొన్ని రోజులుగా లిఫ్ట్ పనిచేయడం లేదు. ప్రతిరోజు ఓపి విభాగానికి వందలాదిమంది రోగులు వారి సహాయకులు వైద్య పరీక్షల కోసం వస్తూ ఉంటారు. విధి నిర్వహణ కోసం వైద్యులు వైద్య సిబ్బంది పరిపాలనా విభాగంలో అధికారులు సిబ్బంది ఇక్కడే ఉన్న కార్యాలయానికి వచ్చి వెళుతూ ఉంటారు. ఓపి విభాగంలో మొదటి అంతస్తు, రెండవ అంతస్తు ల లోని వివిధ విభాగాలకు రోగులు వారి సహాయకులు వెళ్లాలన్న, వైద్యులు అధికారులు సిబ్బంది ఆయా విభాగాలకు వెళ్లాలన్న తీవ్ర స్థాయిలో ఇబ్బందులు పడుతున్నారు. త్వరగా లిఫ్ట్ మరమ్మత్తు చేయించి అమలులోకి వచ్చేలా కృషి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై సి ఎస్ ఆర్ ఎమ్ ఓ డాక్టర్ వై. శ్రీనివాసులు ను వివరణ కోరగా లిఫ్ట్ కంపెనీవారికి సమాచారం ఇచ్చామనీ పిలిపించి త్వరగా మరమ్మత్తు జరిగేలా చూస్తామన్నారు.



రాజీవ్ పార్కులో వైఎస్సార్‌కు నివాళులు అర్పిస్తున్న నాయకులు



చెన్నూరు బస్టాండులోని మానసిక వికలాంగుల కేంద్రంలోని పిల్లల మధ్య కేక్ కట్ చేస్తున్న మహిళా నేతలు



శంకరాపురంలో అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మహానేతా.. నిను మరువలేము

– ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు

కడప కార్పొరేషన్: దివంగత ముఖ్యమంత్రి, మహానేత డా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని ప్రజల హృదయాల్లోంచి ఎవరూ చెరపలేరని మేయర్ కె. సురేష్ బాబు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రా రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. మంగళవారం వైఎస్సార్ జయంతి సందర్భంగా కడప హెడ్ పోస్టాఫీసు వద్దనున్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వినూత్నమైన ప్రజా సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. ఆయన ప్రవేశపెట్టిన రాజీవ్ ఆరోగ్యశ్రీ, 108, 104, ఉచిత విద్యుత్, జలయజ్ఞం, ఫీజు రీయంబర్స్‌మెంట్ పథకాలు దేశవ్యాప్తంగా పేరెన్నికగన్నాయన్నారు. అయన అడుగుజాడల్లోనే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు అడుగులు ముందుకేసి పేద విద్యార్థులకు ఇంగ్లీషు మీడియం విద్య, ఇంటి వద్దకే పింఛన్లు, రేషన్, వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి శివప్రసాద్, షఫీ, దేవిరెడ్డి ఆదిత్య, శ్రీరంజన్‌రెడ్డి, రామక్రిష్టారెడ్డి, బసవరాజు, సుబ్బరాయుడు, రెడ్డి ప్రసాద్, బాలస్వామిరెడ్డి, మియ్యా పాల్గొన్నారు.

జిల్లా పార్టీ కార్యాలయంలో....

స్మిత్ రోడ్డులోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సౌత్‌జోన్ అధ్యక్షుడు ఐస్‌క్రీం రవి ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి, కేక్ కట్ చేసి ఒకరినొకరు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఐస్‌క్రీం రవి, బండి ప్రసాద్, సింధేరవి, పత్తిరాజేశ్వరి, నారాయణమ్మ, మల్లీశ్వరి, కంచుపాటి బాబు, ఏ1 నాగరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం

కడప నగరంలోని శంకరాపురంలో నమస్తే బోర్డు వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తోటక్రిష్ణ, జమ్మిరెడ్డి, రాజాప్రతాప్, సింధు తదితరులు పాల్గొన్నారు.

అల్‌షిఫాలో పండ్లు పంపిణీ

కడప నగరం పాతరిమ్స్ ఆవరణంలో ఉన్న అల్‌షిఫా మానసిక వికలాంగుల కేంద్రంలో గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్ ఆధ్వర్యంలో కడప ఎన్ఆర్ఐ గ్రూప్ సభ్యులు పిల్లలకు పండ్లు, బిస్కట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐ గ్రూప్ సభ్యులు షేక్ గయాజ్, బాబు బాయ్, అన్వర్, మల్లికార్జునరెడ్డి, కువైట్ కమిటీ సభ్యులు సి. అమర్‌నాథ్‌రెడ్డి సుబ్బారెడ్డి, జమాల్‌వలీ, అలీ అక్బర్, మహ్మద్ గౌస్ సాదక్‌అలీ, సమీర్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు చీరెల పంపిణీ

26వ డివిజన్ మాసాపేటలో మాచుపల్లి బస్టాండు వద్ద వైఎస్సార్‌సీపీ నగర ప్రధాన కార్యదర్శి పి. సంపత్ కుమార్, అంగన్‌వాడీ విభాగం నగర అధ్యక్షురాలు చైతల్య ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు త్యాగరాజు, అజ్మతుల్లా, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు ఎస్. వెంకటేశ్వర్లు, నగర అధ్యక్షుడు కంచుపాటి ఆబు, అజయ్, రవి, శ్యాంసన్, శ్యామ్, రమణ పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

అల్పాహారం పంపిణీ

జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఉన్న ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలోని వైఎస్ అవినాష్‌రెడ్డి యూత్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రహీమ్ అల్పాహారం ఏర్పాటు చేశారు. అంతకుముందు వైఎస్సార్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి, స్వీట్లు పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఐస్‌క్రీం రవి, అజ్మతుల్లా పాల్గొన్నారు.

హౌసింగ్ బోర్డు కాలనీలో....

కడప నగరం హౌసింగ్ బోర్డు కాలనీలోని రాజీవ్ పార్కులో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీ రాష్ట్ర మున్సిపల్ విభాగం సంయుక్త కార్యదర్శి వై. శ్రీరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కరిముల్లా, రహీమ్ పాల్గొన్నారు.

వైవీయూలో...

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో యోగివేమన యూనివర్సిటీలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సాయిదత్త ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేసి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వైఎస్ఆర్ ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు శివారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్, నగర ప్రధాన కార్యదర్శి దినకర్ తదితరులు పాల్గొన్నారు.

– 34వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనారిటీ విభాగం ప్రధాన కార్యదర్శి అలీ అక్బర ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి గల్ఫ్ కన్వీనర్, నార్త్‌జోన్ ప్రెసిడెంట్ బీహెచ్ ఇలియాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చాక్లెట్ గౌస్, జమాల్‌వలీ, సయ్యద్ జిలాన్, గయాజ్, పవర్ అల్తాఫ్, సలీం, మొయిద్దీన్ పాల్గొన్నారు.

– 26వ డివిజన్ మాసాపేటలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ విభాగం కార్యదర్శి సి. త్యాగరాజు ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం స్కూల్ పిల్లలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు ఎస్. వెంకటేశ్వర్లు, కంచుపాటి బాబు, పి. సంపత్, అజయ్, రవి, ప్రభుదాస్, కన్నా పాల్గొన్నారు.

– నగరంలో 2, 3, 4 డివిజన్లలో వైఎస్సార్ విగ్రహాలకు ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. 4వ డివిజన్‌లో రామక్రిష్ణ నగర్‌లోని పార్టీ కార్యాలయం వద్ద డివిజన్ ఇన్‌చార్జి ఆర్‌వీ రమణ ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీటీడీ బోర్డు మాజీ సభ్యులు ఎస్. యానాదయ్య, మాజీ కార్పొరేటర్ ఓ. బాలకొండయ్యలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

మానసిక వికలాంగుల కేంద్రంలో...

నగరంలో చెన్నూరు బస్టాండు ఎదురుగా ఉన్న మానసిక వికలాంగుల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మహిళా నేతలు బండి మరియలు, మూలే సరస్వతి, ఉమామహేశ్వరి, సుశీలమ్మ, శ్రీదేవిచ, సుజిత, మల్లీశ్వరి పాల్గొన్నారు.

ఇర్కాన్ సర్కిల్‌లో భారీ అన్నదానం

వైఎస్ జయంతి సందర్భంగా 50వ డివిజన్‌లో ఆ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పాలెంపల్లె రమణ ఆధ్వర్యంలో ఇర్కాన్ సర్కిల్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం 500 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో 49వ డివిజన్ ఇన్‌చార్జి జి.మధువర్ధన్‌రెడ్డి, రూకవారిపల్లె అశోక్‌రెడ్డి, బచ్చుంపల్లె చెన్నారెడ్డి, ప్రసాద్, సుబ్రమణ్యం, గుణశేఖర్, ఓబులేసు, దండు సురేష్, బాబు పాల్గొన్నారు.

ప్రకాష్ నగర్ బీసీ హాస్టల్‌లో...

కడప నగరం ప్రకాష్‌నగర్‌లోని బీసీ హాస్టల్‌లో మంగళవారం రాత్రి వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు గుంటి నాగేంద్ర ఆధ్వర్యంలో విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



ప్రకాష్ నగర్‌లో కేక్ కట్‌చేస్తున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నగర అధ్యక్షుడు నాగేంద్ర



హెడ్ పోస్టాఫీసు వద్ద వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి



మాచుపల్లి బస్టాండు వద్ద పారిశుధ్య కార్మికులకు చీరెలు పంపిణీ చేస్తున్న సంపత్ కుమార్, చైతన్య



ప్రేమాలయ వసతి గృహంలో అల్పాహారం వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు రహీమ్



రామకృష్ణ నగర్ పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ జయంతి వేడుకల్లో యానాదయ్య, ఆర్‌వీ రమణ



ఇర్కాన్ సర్కిల్‌లో అన్నదానం నిర్వహిస్తున్న 50వ డివిజన్ ఇన్‌చార్జి పాలెంపల్లె రమణ

కార్మికులకు వేతనాలు పెంచాలి



కోటిరెడ్డి సర్కిల్‌లో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలో ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో కోటిరెడ్డి సర్కిల్ వద్ద అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులను చిన్న చూపు చూస్తోందని, జీవో నంబర్-36 ప్రకారం రూ.24,500 వేతనం ఇవ్వాలన్నారు. రూ.13,087 వేతనం తీసుకుంటున్న కార్మికులకు తల్లికి వందనం అమలు చేయకపోవడం దారుణమన్నారు. రిటైర్‌మెంట్ వయసును 62 సంవత్సరాలకు పెంచి, రిటైర్ మెంట్ బెనిఫిట్స్ రూ.75000, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో 9న దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెలో పాల్గొని 12వ తేదీ అర్ధ రాత్రి నుండి కడప నగరంలో నీళ్లు, వీధి దీపాలతో పాటు కార్పొరేషన్‌లో అన్ని సేవలు బంద్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాంమోహన్, నగర అధ్యక్ష, కార్యదర్శులు పీవీ సుబ్బయ్య, చంద్రా రెడ్డి, మున్సిపల్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ భాస్కర్, కోశాధికారి గోపి, జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మానంద రెడ్డి, ఆనంద రావు పాల్గొన్నారు.

జడ్జిని కలిసిన మాజీ సైనిక సంక్షేమ సంఘం నాయకులు

కడప అర్బన్: జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్‌ను కడపలోని న్యాయసేవాసదన్‌లో ఉమ్మడి జిల్లాలలోని మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు దాసరి రమణయ్య, గౌరవాధ్యక్షుడు కెప్టెన్ ఎస్ఎస్ రాముడు తదితరులు కలిశారు. పలు అంశాలపై చర్చించారు. జడ్జిని కలిసిన వారిలో ప్రధాన కార్యదర్శి బి.వి గోపాల్ రెడ్డి, కోశాదికారి బి.ఎస్. రాం సింగ్, ప్రొద్దుటూరు ప్రెసిడెంట్ చంద్రమోహన్‌రెడ్డి, జమ్మలమడుగు ప్రెసిడెంట్ లక్ష్మిరెడ్డి, బద్వేల్ ప్రెసిడెంట్ పెంచలయ్య, రాజంపేట ప్రెసిడెంట్ శ్రీనివాసరాజు, రాయచోటి ప్రెసిడెంట్ బాలాజీ, పులివెందుల ప్రెసిడెంట్ జె.జయరామ్‌లు తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈనెల 17వ తేదీన కడపలో జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నగర 7వ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి యస్ వెంకట శివ పేర్కొన్నారు. మంగళవారం సీపీఐ జిల్లా కార్యాలయం హోచిమిన్ భవన్ లో నగర మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే నగర మహాసభల సందర్భంగా 17 తేదీ ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుండి ప్రదర్శనగా యర్రముక్కపల్లి మీదుగా హౌసింగ్ బోర్డు కాలనీలో గాంధీనగర్ హైస్కూల్ వద్దనుండే ఇంజనీర్స్ అసోసియేషన్ హాలు, విశ్వేశ్వరయ్య భవన్ లో మహాసభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శులు కేసీ బాదుల్లా, ఉద్దే మద్దిలేటి, సావంత్ సుధాకర్, టక్కోలి మనోహర్ రెడ్డి, చెంచయ్య, బ్రహ్మం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అదనపు బస్సులు ఏర్పాటు చేయాలి



మంత్రి సవితకు వినతిపత్రం ఇస్తున్న స్కూల్ చిల్డ్రన్ పేరెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కేంద్రీయ విద్యాలయంకు రెండు అదనపు బస్సులు నడిపేలా ఆదేశాలు ఇవ్వాలని కేంద్రీయ విద్యాలయ స్కూల్ చిల్డ్రన్ పేరెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, తల్లిదండ్రులు కోరారు. మంగళవారం స్కూల్ చిల్డ్రన్ పేరెంట్స్ అసోసియేషన్ రూట్-2 అధ్యక్షులు చంద్రగిరి నారాయణ ఆధ్వర్యంలో వారు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవితను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఇందుకు మంత్రి స్పందిస్తూ అదనపు బస్సులు సమకూర్చుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పేరెంట్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

సత్కారం

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సవితకు బ్రహ్మకుమారీ సంస్థ ప్రతినిధులు జ్ఞాపికను అందజేసి ఘనంగా సత్కరించారు. జిల్లాకు విచ్చేసిన మంత్రిని కలిసిన సంస్థ ప్రతినిధులు తాము చేస్తున్న కార్యక్రమాలను మంత్రికి తెలియజేశారు. సమాజంలో శాంతి సాధనకు తమవంతుగా తోడ్పాటు అందిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీ సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ గీతా బెహన్, ప్రదీప అక్కయ్య తదితరులు పాల్గొన్నారు.


మాజీ సైనికుల సమస్యలను పరిష్కరిస్తాం



భక్తవత్సలరెడ్డిని సన్మానిస్తున్న మాజీ సైనికుల సంక్షేమ సంఘ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : దేశానికి విశేష సేవలు అందించిన మాజీ సైనికుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని కడప జిల్లా సైనిక సంక్షేమ అధికారి భక్తవత్సలరెడ్డి తెలిపారు. మంగళవారం కడప నగరంలోని జిల్లా సైనిక కార్యాలయంలో కడప జిల్లా సైనిక సంక్షేమాధికారి భక్తవత్సలరెడ్డిని జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కేవీ రావు, ఉపాధ్యక్షులు ఎస్.పుల్లయ్య నాయుడు, జనరల్ సెక్రెటరీ వి.గోవర్ధన్ రెడ్డి, ట్రెజరర్ ఓబులేసు, గౌరవాధ్యక్షులు శివశంకరరావులు కలిసి ఘనంగా సన్మానించారు. అలాగే ఇంతకు మునుపు ఇక్కడే పనిచేసిన జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎండీ రజాక్‌ఖాన్‌ను కూడా సన్మానించారు. ఈ సందర్భంగా సైనిక సంక్షేమ అధికారి భక్తవత్సల్ రెడ్డి మాట్లాడుతూ ఎర్రముక్కపల్లి సర్కిల్లో ఇంతకు మునుపు ఉన్న మాదిరిగానే సైనిక స్థూపం ఏర్పాటుకు ప్రయత్నిస్తానన్నారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ కో ఆర్డినేటర్ జి.రమేష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ పిఆర్ ఖాన్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

గ్రేడ్-2 జేఎల్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి



ముఖ్యమంత్రికి పోస్టు కార్డులు పంపిస్తున్న గ్రేడ్-2 జేఎల్‌ఎంలు

కడప కార్పొరేషన్: విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న గ్రేడ్-2 జే ఎల్ఎంల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం హెడ్ పోస్టాఫీసు వద్ద పోస్టు కార్డు ఉద్యమం నిర్వహించినట్లు గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు తమ సమస్యలను పోస్టు కార్డు ద్వారా పంపామన్నారు. ఈ సందర్భంగా మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ చాలా కాలంగా విద్యుత్ సంస్థలోని జేఎల్‌ఎం గ్రేడ్-2లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటి పరిష్కారానికి అనేక సార్లు విద్యుత్ యాజమాన్యం దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటులో భాగంగా నియమితులైన జేఎల్‌ఎంలు పూర్తిగా విద్యుత్ సంస్థలలో పనిచేయడం ప్రారంభించినప్పటి నుండి వినియోగదారులకు సరైన సేవలు అందుతున్నాయన్నారు. ఎలాంటి అంతరాయం లేని విద్యుత్తును అందించగలుగుతున్నారన్నారు. విద్యుత్ సంస్థలోని పాత ఉద్యోగులు చేస్తున్న పని, జేఎల్‌ఎం గ్రేడ్-2లు చేస్తున్న పని ఒకటే అయినప్పుడు పాత,కొత్త ఉద్యోగుల మధ్య రెండు రకాల సర్వీస్ రూల్స్ అమలు చట్ట విరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కృపాకర్, ఉపాధ్యక్షులు ఎస్. మల్లికార్జున, డివిజన్ నాయకులు కుళ్లాయప్ప, ప్రకాష్ రాజ్, నాగేంద్ర, మల్లికార్జున, మహమ్మద్ లు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెకు సీపీఎం మద్దతు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ జరిగే దేశవ్యాప్త సమ్మెకు సీపీఎం కడప నగర కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నదని ఆ పార్టీ కడప నగర కార్యదర్శి ఏ రామమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో పని గంటలపై పోరాటం ఇంకా ముగియలేదని, ఎనిమిది గంటల పని దినం కోసం ఉద్యమం మొదలై శతాబ్దాలు గడుస్తున్నా కార్మికులు అధిక పనిగంటలతో పోరాడుతున్నారన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో పని గంటల్ని 10 గంటలకు పెంచుతూ తీర్మానించడం కార్మికుల శ్రమ దోపిడీని పెంచడమే అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా జరిగే దేశవ్యాప్త సమ్మె విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

